ప్రమాదకరంగా పైపులు



హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని తొర్రూర్ వైపు వెళ్ళే పాతరోడ్డులో నడిరోడ్డుపై వదిలేసిన పైపులు ప్రమాదకరంగా మారాయి. రోడ్డుపై గొయ్యి ఏర్పడడంతో రెండు నెలల క్రితం ఇక్కడ డ్రైనేజీ ట్రంకులైను పైపులను తొలగించి కొత్తగా పైపులు వేశారు. ఈ క్రమంలో భూమిలో నుంచి తొలగించిన పైపులను రోడ్డుకు ఓ వైపున పడేశారు. పనులు పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా అక్కడినుంచి పైపులను తొలగించ లేదు. పైపులను తొలగించక పోవడంతో వాహనాలు వాటిని ఢీ కొట్టే ప్రమాదం ఉంది. రోజూ వేల కొద్దీ వాహనాలు వెళ్లే ఈ రోడ్డుపై పైపులను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైపులు రోడ్డుపై ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పైపులను తొలగించాలని కోరుతున్నారు.

మలక్‌పేట్‌లో విజృంభిస్తున్న దోమలు

దిల్‌సుఖ్‌నగర్: దోమలు ఇళ్లపై దండయాత్ర చేస్తున్నాయి. మలక్‌పేట్ జోన్ పరిధిలో రోజురోజుకూ దోమలు విజృంభిస్తున్నాయి. ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్, మార్గదర్శికాలనీ, అల్కాపురి, యాదవనగర్ తదితర కాలనీల్లో చీకటి పడితేచాలు ఇళ్ళపైకి దండెత్తుతున్నాయి. దోమల మందును పిచికారీ చేయాల్సిన జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం అధికారులు సరిగా స్పందించకపోవటంతో దోమలు వృద్ధిచెందుతున్నాయి. స్థానికుల నుంచి అందే ఫిర్యాదుల మేరకు అప్పుడప్పుడూ ప్రధాన రహదారిపై ఫాగింగ్ నిర్వహిస్తూ ప్రజలు, అధికారుల దృష్టిలో పడేలా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఆర్‌కేపురం డివిజన్ పరిధిలో నాలాలు మురికికాలువలు ప్రవహించే బస్తీలను వదిలి కేవలం ప్రధాన రోడ్లపై ఫాగింగ్ చేస్తూ వృథా చర్యలకు పాల్పడుతున్నారు. మూసీ సమీపంలోని కాలనీల్లో దోమలు విజృంభిస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఫాగింగ్ నిర్వహించే శానిటేషన్ సిబ్బంది అడపా దడపా చేస్తున్న బస్తీల్లో ఫాగింగ్ చేయకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఎంటమాలజీ అధికారులు, సిబ్బంది తగిన శ్రద్ధ చూపి దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

వైన్‌షాపును తరలించాలి

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని జైపురి కాలనీ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వైన్ షాప్‌ను మరో ప్రాంతానికి తరలించాలని జైపురికాలనీ కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. జైపురి కాలనీ ఇప్పటికే వెనుకబడి ఉందని, అందరూ పేద, మధ్య తరగతి ప్రజలు ఉంటారని పేర్కొన్నారు. ఇక్కడ ప్రజలకు ఉపయోగ పడే గ్రంథాలయం ఉండాల్సింది పోయి కాలనీలో వైన్ షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న మహిళా సంఘాల నాయకులు మొన్నటి వరకు ఓట్ల గురించి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. మహిళలు స్పందించకుంటే వైన్ షాపులు ద్వారా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జైపురికాలనీ సమీపంలో ఏర్పాటు చేసే వైన్ షాపును మరో ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. వైన్ షాపును జైపురి కాలనీ నుంచి తొలగించకుంటే కాలనీ వాసులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

వైభవంగా కోటి ఒత్తుల దీపోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: హయత్‌నగర్ పరిధిలోని కుంట్లూరు శివబాలాజీ నగర్‌లో సోమవారం రాత్రి కార్తీక మాసం సందర్భంగా కోటి ఒత్తుల దీపోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. ఇక్కడి బ్రహ్మసూత్రేశ్వరుడి ఆలయంలో శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణమంతటా దీపాలు వెలిగించారు. దీంతో ఆ ప్రాంతమంతా దీప కాంతులతో శోభిల్లింది.



మలక్‌పేటలో బీజేపీ

ఓటు బ్యాంక్‌కు గండి



చంచల్‌గూడ: 1983 నుంచి 1999 సంవత్సరం వరకు బీజేపీకి కంచుకోటగా ఉన్న మలక్‌పేట నియోజకవర్గంలో ఇతర పార్టీలు పాగా వేసి తమ అభ్యర్థులను గెలిపించుకున్నాయి. 1983, 1985, 1999లో బీజేపీ అభ్యర్థిగా ప్రస్తుత త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి మూడు సార్లు విజయం సాధించారు. 1989లో కాంగ్రెస్ నుంచి దివంగత నేత పి. సుధీర్‌కుమార్, 1994లో టీడీపీ నుంచి, 2004లో కాంగ్రెస్ నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి రెండు సార్లు విజయం సాధించారు. 2004లో టీడీపీ, బీజేపీ కూటమిగా ఎన్నికల బరిలో ఉండగా మలక్‌పేట అభ్యర్థిగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి టికెట్ కేటాయించడంతో ఇంద్రాసేనారెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి బరిలోకి దిగారు. ఇంద్రసేనారెడ్డి జాతీయ రాజకీయాలపై దృష్టి పెట్టడంతో బీజేపీకి కంచుకోటగా ఉన్న మలక్‌పటలో బలమైన నాయకుడు కరువయ్యాడని పార్టీ శ్రేణులు వాపోతున్నారు.

2009 నుంచి మలక్‌పేటలో పాగా వేసిన మజ్లిస్...

2009 ఎన్నికల్లో మలక్‌పేటలో మొట్టమొదటి సారిగా పోటీ చేసిన ఎంఐఎం పార్టీ బోణీ కొట్టింది. 2009 నుంచి 2023 వరకు ఎంఐఎం అభ్యర్థి అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా వరుసగా విజయం సాధిస్తూ వచ్చారు. నల్లు ఇంద్రసేనరెడ్డి బీజేపీ నుంచి మలక్‌పేటలో మూడు సార్లు విజయ ధుందుభి మోగించారు. ప్రస్తుత ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బలాలా వరుసగా నాలుగోసారి విజయం సాధించి రికార్డు బ్రేక్ చేశారు. 2009లో బీజేపీ నుంచి పోటీ చేసిన జి. కరుణాకర్ 16997 ఓట్లు సాధించారు. మలక్‌పటలో ఎంఐఎంను ఢీకొట్టే నాయకుడు లేకపోవడంతో అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన బి. వెంకట్‌రెడ్డిని బీజేపీ నుంచి బరిలోకి దింపగా 45375 ఓట్లు సాధించాడు.

స్థానికేతరుడంటూ బీజేపీలో దుమారం...

2018లో అంబర్‌పేట నుంచి పోటీకి దిగాలని ఆశలు పెట్టుకున్న బి. వెంకట్‌రెడ్డి మలక్‌పేట నుంచి మరీ పోటీ చేయడానికి విముఖత వ్యక్తం చేశాడు. దీంతో యాఖుత్‌పురా నియోజకవర్గానికి చెందిన గౌలీపురా మాజీ కార్పొరేటర్, దివంగత నేత టైగర్ నరేంద్ర కుమారుడు ఆలె జితేంద్రను అభ్యర్థిగా ప్రకటించారు. ఆలె జితేంద్రను ప్రకటించగానే స్థానికేతరుడంటూ అసమ్మతి సెగలు రేకెత్తించారని పార్టీ కార్యకర్తలు ఇప్పటికీ చెప్పుకుంటారు. స్థానికేతరుడైన జితేంద్రకు టికెట్ ఎలా కేటాయిస్తారని కొందరు పెద్ద దుమారం లేపి పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. జితేంద్రకు ప్రకటించిన టికెట్ రద్దు చేయాలని అధిష్టానానికి సైతం లేఖ రాశారు. టైగర్ నరేంద్ర బీజేపీకి, హిందూ సమాజానికి చేసిన సేవలను ఎలా మరుస్తామని, బీసీ బిడ్డను టార్గెట్ చేయడం సరికాదని పార్టీ రెండు వర్గాలుగా చీలింది. టికెట్ ఆశించిన వారు నామమాత్రంగా జితేంద్రకు పని చేశారు. 2016 జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో నియోజకవర్గంలో బీజేపీ ఒక్క కార్పొరేటర్ సీటు లేకున్నప్పటికీ గడ్డు పరిస్థితుల మధ్య జితేంద్ర 20,880 ఓట్లు సాధించాడు. 2020 కార్పొరేషన్ ఎన్నికల్లో మలక్‌పేట నియోజకవర్గంలో బీజేపీ 33,343 ఓట్లు సాధించడంతో పాటు సైదాబాద్, మూసారంబాగ్ స్థానాలను గెలుచుకుంది. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థి సురేందర్‌రెడ్డి 23,731 ఓట్లు మాత్రమే సాధించాడు. జీహెచ్‌ఎంసీ, అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే బీజేపీకి దాదాపు 9612 ఓట్లు తగ్గాయి.

గుర్రపుడెక్క తొలగింపుతో దోమల సమస్య పరిష్కారం



సరూర్‌నగర్ చెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి

సైదాబాద్: సరూర్‌నగర్ చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపుతో పరిసర కాలనీల్లో దోమల సమస్య పరిష్కారం అవుతుందని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి అన్నారు. సోమవారం కార్పొరేటర్ ఎంటమాలజీ అధికారులు, సిబ్బందితో కలిసి సరూర్‌నగర్ చెరువు పరిసరాలను పరిశీలించారు. చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను ఎంటామాలజీ సిబ్బంది తొలగిస్తున్న పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చెరువులో గుర్రపుడెక్క పెరగడంతో దోమల సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు తెలపగా, వెంటనే ఎంటామాలజీ అధికారులతో సమావేశమై చెరువు పరిసరాలు శుద్ధి చేయాలని నిర్ణయించామని తెలిపారు. అందులో భాగంగా చెరువులోని గుర్రపుడెక్కను తొలగిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంటమాలజీ విభాగం ఏఈ భారతి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సత్కరించిన నాయకులు



చైతన్యపురి: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని చైతన్యపురి, గడ్డిఅన్నారం డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చైతన్యపురి మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, గడ్డిఅన్నారం బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డిలు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



కార్యక్రమంలో డివిజన్ల నాయకులు పాల్గొన్నారు.

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యేగా మూడోసారి విజయం సాధించిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని సోమవారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అందుబాటులో ఉండి ప్రజా సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న షేక్ అక్బర్

మలక్‌పేట: నియోజకవర్గంలోనే ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మలక్‌పేట కాంగ్రెస్ నేత షేక్ అక్బర్ అన్నారు. ఎన్నికల ఫలితాల వెలువడిన సందర్భంగా అక్బర్‌బాగ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఓటువేసిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేవిధంగా చూస్తామన్నారు. పార్టీ కోసం పని చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యకర్తలు అధైర్యపడొద్దని పార్టీ ఎల్లప్పుడు అండగా నిలబడుతుందన్నారు. సమావేశంలో సీనియర్ నేతలు మందడి విజయసింహారెడ్డి, బాలకృష్ణయాదవ్ పాల్గొన్నారు.



ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్‌మేళా

వనస్థలిపురం: వనస్థలిపురంలో హుడా కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళా (ఎగ్జిబిషన్ అండ్ సేల్)కు విశేష స్పందన లభిస్తోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు స్థానికులు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, గాజులు, ముత్యాలు తదితర వస్తువుల కొనుగోలుకు స్థానికుల నుంచి ఆదరణ బాగుందని నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు.



ఎక్కడ పడితే అక్కడ చెత్త

హస్తినాపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని అనేక ప్రాంతాలలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించకపోవడంతో రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్తపేరుకుపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. హస్తినాపురం, వనస్థలిపురం, చంపాపేట్, లింగోజిగూడ డివిజన్లపరిధిలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యం మూలంగా క్షేత్ర స్థాయిలో పారిశుధ్య పనులు సక్రమంగా జరగడంలేని దీనితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్యపనులు సక్రమంగా జరిగేవిదంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు నడుద్దాం



ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన పాస్టర్లు

మలక్‌పేట: సమస్యల పరిష్కారానికి క్రైస్తవులు ఐక్యతతో ముందుకు నడవాలని మలక్‌పేట పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యం అబ్రాహం అన్నారు. హౌజ్ ఆఫ్ గాడ్ చర్చిలో సోమవారం పాస్టర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడనున్న ప్రభుత్వం కోసం, నాలుగోసారి మలక్‌పేటగా గెలుపొందిన ఎమ్మెల్యే అహ్మద్ బలాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మాసంలో జరుగనున్న సెమీ క్రిస్మస్ సంబరాలను విజయవంతం చేయాలని కోరారు. ప్రార్థనల్లో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అనితా షీబారాణి, పాస్టర్లు పాల్గొన్నారు.

మరింత అభివృద్ధి చేస్తా



మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా మరోసారి విజయం సాధించిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని నియోజకవర్గంలోని పలువురు నాయకులు సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. నన్ను ఎమ్మెల్యేగా ఎన్నుకుని ఆశీర్వదించిన ఎల్‌బీనగర్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...).. టమోటా రూ.19. వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 28, కాకర 35, బీర 35, క్యాలిఫ్లవర్ 18, క్యాబేజీ 13, కారెట్ 33, దొండ 28, ఆలు 21, ఉల్లి 34, గోకర 28, దోస 23, సొర 11, పొట్ల 13, అరటి 09, చిక్కుడు 40, అర్వి 38, మునగ 75, చిలగడదుంప 50, బీట్‌రూట్ 31, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 40, కాప్సికమ్ 40. ఈ ధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి.

ఉనికిని కాపాడుకోలేని మజ్లిసేతర పార్టీలు

- పాతబస్తీలోని 4 నియోజకవర్గాల్లో బేఖాతరు చేసిన ఓటర్లు
- డిపాజిట్లు కాపాడుకోలేని వివిధ పార్టీల అభ్యర్థులు
- పార్టీ ఫండ్, ఓట్ల చీలిక కోసమేనా.. అన్నట్లు ఫలితాలు

చార్మినార్: మజ్లిసేతర పార్టీలను పాతబస్తీ ఓటర్లు బేఖాతరు చేశారు. పాతబస్తీలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, యాకుత్‌పురా నియోజకవర్గాలలో ఆయా అభ్యర్థులు ఏమాత్రం ఓటర్లను ప్రభావితం చేయలేక పోయారు. ఈ ఎన్నికల్లో పాతబస్తీలోని నాలుగు శాసనసభ నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన మజ్లిసేతర పార్టీల అభ్యర్థులు కనీసం డిపాజిట్లను సైతం దక్కించుకోలేక పోయారు. చార్మినార్‌లో బీజేపీ, యాకుత్‌పురాలో ఎంబీటీ పార్టీల అభ్యర్థులు మజ్లిస్ పార్టీ అభ్యర్థితో హోరాహోరీ పోరు కొనసాగించి రెండో స్థానంలో నిలిచారు. పాతబస్తీలో సరైన నాయకగణం లేకపోవడమే కాకుండా.. టికెట్లు కేటాయింపులో పార్టీ అధిష్టానం వ్యవహరించిన తీరు స్థానిక నాయకులకు మింగుడుపడలేదు. మొదటి నుంచి పార్టీ టికెట్లు ఆశించిన సీనియర్ నాయకులకు కాకుండా వేరే వారికి కేటాయించడంతో పాతబస్తీలో మజ్లిసేతర పార్టీలు చతికిలబడ్డాయి. ముందుగా ఆశించిన విధంగా సకాలంలో పార్టీ ఫండ్ లభించకపోవడంతో పాతబస్తీ మజ్లిసేతర పార్టీ అభ్యర్థులు తమ ప్రచారాన్ని పూర్తిస్థాయిలో నిర్వహించ లేకపోయారు. డబ్బులు ఇవ్వకపోతే ఎలా..అంటూ అభ్యర్థులు వాపోయారు. పార్టీ ఫండ్‌పై ఉంచిన శ్రద్ధ ప్రచారంపై చూపించ లేదు.

పార్టీ ఫండ్, ఓట్లు చీల్చడం కోసమేనా పోటీ..?

- పాతబస్తీ నుంచి టికెట్లు ఆశించిన మజ్లిసేతర పార్టీల అభ్యర్థులు కేవలం పార్టీ ఇచ్చే ఫండ్‌తో పాటు ఒక వర్గం ఓట్లు చీల్చడం కోసమేనా అన్నట్లు ఎన్నికల సరళి కనిపించింది.
- మజ్లిస్ పార్టీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఫ్రెండ్లీ పార్టీలంటూ ఎన్నికల బరిలో తమ అభ్యర్థులను నిలిపారు.
- మజ్లిస్ పార్టీ బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపగా.. లోపాయికారి ఒప్పందంతో బీఆర్‌ఎస్ అంతగా ప్రభావం చూపని బలహీనమైన అభ్యర్థులను ఎన్నికల బరిలోకి దింపింది. ఈ విషయం ఫలితాల సందర్భంగా స్పష్టమైంది.
- పార్టీ ఫండ్ వస్తేనే ప్రచారం నిర్వహిస్తామనే ధోరణిలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఉంటారు. ఒక దశలో పార్టీ ఫండ్ రావడం లేదని తెలుసుకుని పార్టీ అధినేతల వద్దకు 'క్యూ'కడుతుంటారు.
- ప్రతి ఎన్నికల సందర్భంగా పాతబస్తీలో చోటు చేసుకునే అంశం ఇదీ.

స్థానికులే అయినా.. ఉనికిని కాపాడుకోలేకపోయారు..

- పాతబస్తీలోనే పుట్టి పెరిగిన అభ్యర్థులను మాత్రమే వివిధ పార్టీలు (మజ్లిసేతర) రంగంలోకి దింపినప్పటికీ ఏ మాత్రం ఫలితం లేకుండాపోయింది.
- స్థానికంగా ఉన్న నాయకులే అయినప్పటికీ.. ఆశించిన విధంగా ఓట్లు సంపాదించలేకపోయారు.
- చార్మినార్, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా నియోజకవర్గాల అభ్యర్థులకు పాతబస్తీ ఓటర్లు ఏమాత్రం మొగ్గు చూపలేదు. ఏదీ ఏమైనప్పటికీ మజ్లిసేతర పార్టీల అభ్యర్థుల్లో కొందరు కనీసం డిపాజిట్లను సైతం దక్కించుకోలేకపోయారు.

చార్మినార్ నియోజక వర్గంలో..
బీజేపీ అభ్యర్థి మేఘారాణి 26,249 ఓట్లతో రెండో స్థానంలో నిలవగా..కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ 10898 ఓట్లతో మూడో స్థానం దక్కించుకోగా.. బీఆర్‌ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గంలో తన ఉనికిని కోల్పోయే విధంగా ఇక్కడి చార్మినార్ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధి 8853 ఓట్లతో నాలుగో స్థానానికి వెళ్లి డిపాజిట్ కోల్పోయాడు.

చాంద్రాయణగుట్టలో..
బీఆర్‌ఎస్ అభ్యర్థి ముప్పిడి సీతారాం రెడ్డి 14,224 ఓట్లతో రెండో స్థానంలో.. బీజేపీ అభ్యర్థి 16114 ఓట్లతో మూడో స్థానం దక్కించుకున్నప్పటికీ డిపాజిట్ దక్కలేదు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్‌ఎస్, బీజేపీలు ఓట్ల చీలికకు మాత్రమే పోటీలో ఉన్నట్లు కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

బహదూర్‌పురాలో..
బీఆర్‌ఎస్ అభ్యర్థి మీర్ ఇనాయత్ అలీ బాక్రీ 22246 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచినప్పటికీ డిపాజిట్ కాపాడుకోలేకపోయాడు. మజ్లిస్ పార్టీకి ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేష్ కుమార్ 14278 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. వీరెవరూ డిపాజిట్లను కాపాడుకోలేకపోయారు.

యాకుత్‌పురాలో..
ఎంబీటీ అభ్యర్థి అంజదుల్లా ఖాన్ 45200 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. బీజేపీ అభ్యర్థి వీరేందర్ యాదవ్ 22165 ఓట్లతో మూడో స్థానంలో నిలువగా..బీఆర్‌ఎస్ నాలుగో స్థానానికి పడిపోయింది. ఈ నియోజకవర్గంలో ఎంబీటీ అభ్యర్థి మజ్లిస్ పార్టీకి గట్టి పోటీ నిచ్చి ఫలితాల సందర్భంగా నువ్వా..నేనా..అన్న రీతిలో ఉత్కంఠకు తెలిపారు.

మధు యాష్కికి కలిసిరాని ఎల్‌బీనగర్

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్నప్పటికీ మారిన రాజకీయ పరిణామాల కారణంగా ఎన్నికల ముందు వచ్చిన మధుయాష్కిగౌడ్‌కు ఎల్‌బీనగర్ ప్రజలు షాక్ ఇచ్చారు. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి రెండు సార్లు కాంగ్రెస్, ఒకసారి తెలుగుదేశం పార్టీలు విజయం సాధించగా ఈ సారి గులాబీ జెండాకు జైకొట్టారు. 2009లో ఏర్పడిన ఎల్‌బీనగర్ నియోజకవర్గం మినీ ఇండియకు మారు పేరు. ఇక్కడ అన్ని కులామతాలకు సంబంధించిన వ్యక్తులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన ప్రజానీకం అధికం నియోజకవర్గంలో అధిక శాతం విద్యావంతులు కావడంతో ఎప్పుడు ఎలాంటి తీర్పు ఇస్తారో తెలియని ఆయోమయం. 2009లో జరిగిన ఎన్నికలలో ప్రస్తుత ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి టీడీపీపైన విజయం సాధించారు. 2014లో బీసీ నాయకులు ఆర్.కృష్ణయ్య బీర్‌ఎస్ అభ్యర్థి రాం మోహన్‌గౌడ్ పై విజయం సాధించగా ఈ ఎన్నికల్లో సుధీర్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి మూడో స్థానానికి పరిమితమయ్యారు.2018 ఎన్నికల్లో సుధీర్‌రెడ్డి మరో సారి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాంమోహన్‌గౌడ్‌పై విజయం సాధించారు. తర్వాత జరిగిన పరిణామాలతో సుధీర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరడంతో కాంగ్రెస్ పార్టీకి పెద్ద దెబ్బ తగిలింది. గ్రేటర్ ఎన్నికలలో సైతం కాంగ్రెస్ పార్టీ ఘోరపరాభవం చవిచూసింది. ఈ పార్టీకి నియోజకవర్గంలో సరైన నాయకత్వం లేక పోవడంతో పార్టీ బలహీనపడింది.

కాంగ్రెస్ పార్టీ ఓటమికి కారణాలు..

సుధీర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరడంతో పార్టీ ముఖ్యనాయకులు కూడా ఆయనతో పాటు బీఆర్‌ఎస్‌లో చేరారు.దీంతో సరైన నాయకత్వం లేక పోవడంతో పార్టీ చతికిలపడింది. కరోన సమయంలో పార్టీ సేవలు కాని, విపత్కర సమయంలో ప్రజలకు ఆ పార్టీ నాయకులు అందుబాటులో లేక పోవడంతో ప్రజలు కాంగ్రెస్‌కు దూరం అయ్యామయ్యారని చెప్పవచ్చు. గ్రేటర్ ఎన్నికలలో మల్‌రెడ్డి రాంరెడ్డిని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా నియమించి పార్టీ అబివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యతను అయన మీద ఉంచారు.మరో సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి సైతం పార్టీ పటిష్టతకు పాదయాత్రలు నిర్వహించారు. అయినప్పటికి ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కాలేదు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు మధయాష్కిగౌడ్ ఎల్‌బీనగర్ నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి తనే పోటీ చేస్తానని పేర్కొనడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసి ఈ పంచాయతీని డిల్లీకి తీసుకెళ్లారు.అయిన అధిష్టానం మధుయాష్కిగౌడ్‌కే ప్రాధాన్యత ఇవ్వడంతో టికెట్టు ఆయననే వరించింది.బీసీ నేతనైన తనకు బీసీలు మద్దతు ఇచ్చిగెలిపిస్తారని ఆశతో బరిలోకి దిగారు.

కలిసిరాని బీసీ జపం

ఎల్‌బీనగర్‌లో 2014లో బీసీ నాయకులు ఆర్.కృష్ణయ్య బీసీ నేపంతో పోటీ చేయడంతో అధిక మెజారీతో ప్రజలు గెలిపించారు. దీంతో అదే ఫార్ములా పని చేస్తుంది అనే ఆశతో మధుయాష్కిగౌడ్ పోటీ చేశారు. కానీ ప్రజలు ఈ సారి బీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కట్టి కాంగ్రెస్‌ను తిరస్కరించారు. ఏకంగా కాంగ్రెస్ ఈ ఎన్నికలలో మూడో స్థానానికి పరిమితమైంది. బీజేపీ రెండో స్థానంలో నిలిచింది.

అయ్యప్ప స్వాములకు ఆహార పదార్థాల పంపిణీ

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం ప్రాంగణంలో అయ్యప్ప స్వామి దీక్ష చేపట్టిన అయ్యప్ప భక్తులకు సోమవారం ఉదయం ఉచితంగా ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ ప్రతినిధి చలువాది శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పూజల అనంతరం భక్తులకు టిఫిన్ బాక్స్‌లలో ఆహార పదార్థాలను అందజేశారు. శ్రీకాంత్ మాట్లాడుతూ..ఐదేళ్లుగా అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ఉచిత ఆహార పదార్థాల పంపిణీ కార్యక్రమం చేయడం జరుగుతుందన్నారు.



ఆహార పదార్థాలను అందజేస్తున్న చలువాది శ్రీకాంత్